రాజ్యాంగ దార్శనికుడు అంబేద్కర్

ప్రజాశక్తి - క్యాంపస్ : రాజ్యాంగ దార్శనికుడు అంబేద్కర్ అని విసి ఆచార్య కృష్ణమూర్తి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని భారతరత్న అంబేద్కర్ దార్శనికత, సమకాలీన సమాజంలో రాజ్యాంగంపై అవగాహన, సామాజిక న్యాయం అనే అంశంపై 2 రోజుల జాతీయ సదస్సు కార్యక్రమ ప్రారంభోత్సవం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వ విద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం అధ్యాపకులు నల్లన్న, విజయలక్ష్మి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ చందూలాల్, పి.ఆర్.ఓ రమేష్ బాబు, సాహిత్య సంస్కృతి డీన్ సత్యనారాయణ, ఉమెన్స్ హాస్టల్ అడిషనల్ చీఫ్ వార్డెన్ పరమిత పండ, జ్యోతి, మేరీ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూత 'బడి'పై పోరు

మోడల్ పేరుతో విలీనం

- జిల్లాలో 900కు పైగా పాఠశాలలు మూసివేత !
- ఎంఇఓ ల ద్వారా ఉపాధ్యాయులపై ఒత్తిళ్లు
- ప్రభుత్వ చర్యలు వ్యతిరేకిస్తూ నేడు నిరసన ప్రదర్శన, ర్యాలీ

ప్రజాశక్తి - తిరుపతి: మోడల్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ బడుల విలీనమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలను అమలు చేస్తోంది. పేద విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేసేలా కుట్రలు పన్నుతోంది. ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూలు మాత్రమే విలీనం చేస్తామని చెప్పిన సర్కారు... మండల విద్యాశాఖ అధికారుల ద్వారా 7 కిలోమీటర్ల పరిధికి పెంచాలని టీచర్లపై ఒత్తిడి చేస్తోంది. దీని ద్వారా తిరుపతి జిల్లాలో 60 కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న 900 స్కూళ్లను మూసి వేసే దిశగా ముందుకెళ్తోంది. జిల్లా కలెక్టర్ ద్వారా నేరుగా మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ దుందుడుకు చర్యల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు భారీ నిరసన ప్రదర్శన ర్యాలీని నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వ వ్యవహార శైలిపై తమ నిరసనను వ్యక్తం చేసేందుకు సిద్ధమవడం గమనార్హం.

మోడల్ పేరుతో కుట్ర

ప్రభుత్వం తమ ప్రచార ఆర్భాటంలో భాగంగా మోడల్ స్కూలును తెరపైకి తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ ప్రాథమిక విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ప్రతి పంచాయతీలోనూ మోడల్ స్కూల్లో ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూలు మాత్రమే విలీనం చేస్తున్నామని ప్రభుత్వం తొలుతగా ప్రకటించింది. ఆ తర్వాత ఆ పరిధిని ఏ కిలోమీటర్లకు పెంచాలని ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఈ మేరకు తమకేమీ అభ్యంతరం లేదంటూ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల పై తీవ్ర ఒత్తిడి చేసి తీర్మానాలను చేయిస్తోంది. ఇలా దాదాపు 900 స్కూళ్లను మూసి వేసే దిశగా ప్రభుత్వం ఇటు అధికారులు సన్నద్ధమవడం గమనార్హం.

నేడు నిరసన ప్రదర్శన, ర్యాలీ

రాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం సాగిస్తున్న దాడి, పాఠశాలల రద్దును వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు భారీ నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి ఇందిరా మైదానం నుంచి నాలుగు కాళ్ల మంటపం, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రజాప్రదర్శనను నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వనున్నారు.

పాఠశాలల మూసివేతే లక్ష్యమా ?

పాఠశాలల మూసివేతే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117, 128 జీఓలను రద్దు చేస్తూ వాటి స్థానంలో మరింత దారుణంగా ఆంక్షలు ఉన్న "మెమో"ను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఫలితంగా తిరుపతి జిల్లాలో 900 స్కూళ్లు మూతపడి పేద విద్యార్థులు విద్యకు దూరం కాబోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు.

- కందారపు మురళి, ప్రజా సంఘాల ఐక్యవేదిక

టిటిడి ప్రతిష్టను దిగజార్చే కుట్ర

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టిటిడి గోశాలలో ఇటీవల 100 గోవులు మృతి చెందాయంటూ టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కుట్రపూరితంగా ఉన్నాయని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం టిటిడి గోశాలలో గోవులను, గోవుల ఆవాసాలను, వాటికి రోజువారీ అందించే దాణాను మీడియా, అధికారులతో కలసి పరిశీలించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ టిటిడి గోశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, గోవులను తల్లిలా భావించి ఎప్పటికప్పుడు దాణా, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఎక్కడో మృతి చెందిన గోవుల ఫోటోలను, గత పాలనలో గోశాలలో మరణించిన గోవుల ఫోటోలను చూపి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలనలో మరణించిన గోవుల ఫోటోలను, తేదీలను మార్చి ప్రస్తుతం చనిపోయినట్లు చూపిన ఫోటోలను మీడియాకు చూపించారు. టిటిడి ఛైర్మన్ గా కరుణాకర్ రెడ్డి ఉండగా గోవులకు కాలం చెల్లిన మందులు, పురుగులు పడ్డ దాణా పంపిణీ చేసినట్లు వారి పాలనలో విజిలెన్స్ నివేదికే స్పష్టం చేస్తోందన్నారు. ఈ సందర్భంగా అప్పటి విజిలెన్స్ నివేదికను, అందుకు సంబంధించిన ఫోటోలను మీడియాకు చూపించారు. ప్రతీ రోజూ అసత్య ఆరోపణలు, పచ్చి అపద్దాలతో టిటిడి సంస్థ మీద బురద చల్లుతూ రాజకీయ లబ్ది పొందాలని చూస్తే జీరో అవుతారని హెచ్చరించారు. టిటిడి కమీషన్ల ఛైర్మన్‌గా కరుణాకర్ రెడ్డి అపకీర్తి మూటగట్టుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిటిడి బోర్డు సభ్యులు జీ. భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

భూమన.. అసత్య ఆరోపణలు మానుకో
: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఎస్వీ గోశాలలో నూరు ఆవులు చనిపోయాయని మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. గత మూడు నెలల్లో అనారోగ్యాల కారణంగా 40 ఆవులు మృతి చెందాయని చెప్పారు. తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ గోశాలలో 260 మంది ఉద్యోగులు గోవుల సంరక్షణ చూసుకుంటున్నారన్నారు. ఎక్కడో చనిపోయిన ఆవుల ఫోటోలను మార్ఫింగ్ చేసి గోశాలలో చనిపోయాని కరుణాకర్ రెడ్డి ఆరోపణలు చేశారని తెలిపారు. అసత్యపు ఆరోపణలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు రాజా రెడ్డి, మహేష్ యాదవ్, బాబ్జీ, జీవకోన సుధాకర్, పోటుకూరి ఆనంద్, రాజేష్ ఆచ్చారి, సానె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై అసత్య ప్రచారాలు తగవు
: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టీటీడీ గోశాలలో ఆవులు మృతి చెందాయని వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నామని గతంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ఆయన అనేక స్కాములు చేశారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక అన్యమతస్తుడికి వైసిపి ప్రభుత్వం టిటిడి చైర్మన్ ఇవ్వడం దౌర్భాగ్యమన్నారు. అసత్య ప్రచారాలు మానుకోకపోతే హిందువులందరూ తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, శివకుమార్, రహీం, శ్రీనివాసులు, అల్లిభాష, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

భూమన ఆరోపణలు అర్థరహితం
: ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తప్పుడు ప్రచారాలతో మత విద్వేషాలు రెచ్చగొటాలన్నదే వైసిపి కుట్ర, అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ గోశాలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. గోశాలలో 2,668 ఆవులకు జియో టాకింగ్ చేసి బర్త్ అండ్ డెత్ రిజిస్టర్ పగడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. పాత గణంకాల ప్రకారం వృద్ధాప్యం, అనారోగ్య సమస్యల వల్ల నెలకు 10 ఆవులు చని పోతున్నాయన్నారు. టీటీడీ పవిత్రతను కాపాడేం దుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోం దని, అసత్య ప్రచారం మానాలని హితవు పలికారు.

బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

నివాళులర్పిస్తున్న టిటిడి బీసీ ఉద్యోగులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా తిరుపతి నగర పరిధిలోని డివిఆర్ రోడ్డు మార్గంలో ఆయన విగ్రహానికి టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంగం అధ్యక్షులు పావులూరు రవీంద్రబాబు, టిటిడి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గంగా రాజ్ కుమార్, కోశాధికారి కామరాజు, సభ్యులు రామచంద్ర, దేశయ, రెడ్డప్ప, మురళి, సి.రెడ్డప్ప, సెల్వ రాజు తదితరులు పాల్గొన్నారు.

బోయలను గిరిజన జాబితాలో చేర్చొద్దు

- రేణిగుంట గిరిజన సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - రేణిగుంట : బిసి- ఏ కులానికి చెందిన బోయలను, ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చవద్దు అంటూ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద 'నిరసన ధర్నా' చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొరబు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్ మాట్లాడుతూ.. బి సి ఏ కులానికి చెందిన బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చడం వల్ల మైదాన ప్రాంత గిరిజన తెగకు చెందిన ఎరుకల, యానాది, లంబాడి, షికారి కులాలకు ద్రోహం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తెలుగుదేశం, కేంద్ర బిజెపి ప్రభుత్వాలు తమ ఓట్ల కోసం, సీట్ల కోసం రాజ్యాధికార ధ్యాసతో బాగా అభివృద్ధి చెందిన బోయ, ఇతర కులాలను గిరిజన జాబితాలో చేర్చడం ద్వారా మైదాన ప్రాంత గిరిజనులకు ద్రోహం చేయడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దినారి ప్రభాకర్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి హరినాథ్, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి ప్రసాద్, అఖిలభారత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర రవి నాయక్, మండల కార్యదర్శి గోళ్ళ వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం మండల అధ్యక్షురాలు ధరణి, మండల కార్యదర్శి కొండ్రెడ్డి ఈశ్వరమ్మ, ఏకలవ్య ఎరుకల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మేంద్రగుత్తి చీరాలయ్య, గిరిజన సంఘం మండల నాయకులు రోడ్డ మునిస్వామి, శ్రీకాంత్, రత్నబాబు, ఈశ్వరయ్య, ఆనంద్ బాబు, గుణశేఖర్, విజయమ్మ, రాముడు, గురుమూర్తి, సుధాకర్, సులోచన, భాస్కర్, ప్రభాజ్యోతి, గాయత్రి, గీత, చెన్నకేశవులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి వద్ద గోవులకు టీడీపీ నాయకుల పూజ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దేవుడితో రాజకీయాలు చేస్తున్న కరుణాకర్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న గోశాలలో గోవులకు పూజలు చేసినట్లు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కోడూరు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు..తిరుపతి,అలిపిరి శ్రీవారి పాదాల మండపం వద్ద ఉన్న గోకులంలోని గోవులకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.తిరుపతి గోశాలలో గోవులు మృతి చెందయని అసత్య ప్రచారం చేసిన కరుణాకర్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని దేవుణ్ణి ప్రాదించినట్లు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. కరుణకు "కరుణ" లేదని, దేవునితో కూడా రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. భక్తుల మనోభావలతో చెలగాటం అడవద్దని,హితవు పలికారు.వాస్తవాలను దాచి,అవాస్తవాలను ప్రచారం చేస్తే,తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుల్లెట్ రమణ, మధుబాబు, రఫీ, ఐ.ఎస్.ఖాజా, లక్ష్మీ, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యం

- మరింత చేయూతకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన
- చేతివృత్తులకు మరింత ప్రోత్సాహకం
- ప్రజాశక్తితో డిఆర్డిఏ పీడీ శోభన్ బాబు

ముఖా ముఖి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ఆలోచన చేసిందని, దీని ద్వారా స్వయం సహాయక సంఘాలలోని సభ్యులు వారి సీనియారిటీ ప్రకారం తీసుకున్న ఋణాలు, దానితో ఏ విధంగా వారి కుటుంబానికి, వ్యాపార అభివృద్ధికి ఉపయోగపడింది, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్మెంట్ అథారిటీ విభాగం ద్వారా స్వయం సహాయక సంఘాలతో పాటుగా చేతివృత్తుల వారికి ఎలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, రుణ సదుపాయాలు వంటి అంశాలపై సంబంధిత విభాగ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు పలు విషయాలను ప్రజాశక్తి నిర్వహించిన ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రజాశక్తి : స్వయం సహాయక సంఘాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఆలోచన ఏమిటి?

డిఆర్డిఏ పీడీ : స్వయం సహాయక సంఘాలను మరింతగా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఓ సర్వేను చేపట్టింది. ఈ సర్వే ద్వారా సంఘాలలోని సభ్యులు తీసుకున్న రుణాలతో ఎటువంటి ప్రయోజక కార్యక్రమాలకు ఆ రుణాన్ని ఉపయోగించారు, దానిద్వారా వారికి ఎటువంటి లబ్ధి చేకూరింది అన్న విషయాలను సంఘమిత్రలు వారికి ఇప్పటికే ఉన్న మొబైల్ యాప్ ద్వారా ఈ వివరాలను నమోదు చేస్తారు. ఈ వివరాల ద్వారా వారు తీసుకున్న రుణాలతో పొందిన లబ్ధి, మరింత ప్రయోజనం చేకూరడానికి అవసరమైన రుణాల మంజూరు, వీటికి సంబంధించిన ప్రణాళికలను తయారుచేసి ప్రభుత్వానికి పంపనున్నాం. ఇప్పటి తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1279 వివో సంఘాలు, 33953 వేల స్వయం సహాయక సంఘాలు, 3,48,846 మంది తిరుపతి జిల్లా వ్యాప్తంగా సంఘాల సభ్యులు ఉన్నారు. ఒక్కో సంఘంలో ఐదు మంది ఎన్యూమరేటర్ ఈ సర్వేను కొనసాగిస్తున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ 5 సంఘాలలోని సభ్యులను విచారించి వారి రుణాలకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు.

ప్రజాశక్తి : ముఖ్యంగా ఈ సర్వేలో ఎలాంటి విషయాలపై సభ్యుల నుండి వివరాలు సేకరిస్తారు?

డిఆర్డిఏ పీడీ : ఈ సర్వేలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలు చేరినప్పటి నుండి తీసుకున్న రుణాలు మొత్తం ఎంత?, దానిద్వారా వాళ్లు ఆ రుణాన్ని వ్యాపారం మీద ఇన్వెస్ట్మెంట్ చేశారా?, మరి ఇతర అవసరాలకు వినియోగించారా అన్న అంశాలను సేకరిస్తాం. ఒక సభ్యురాలు సంఘం నుండి తీసుకున్న రుణం వారి కుటుంబ సభ్యుల్లోని వారికి ఆరోగ్య నిమిత్తం, పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు రుణాలు సహజంగా తీసుకుంటుంటారు. కానీ సభ్యురాలు కుటుంబం ఆర్థిక పరిస్థితి మెరుగు పడటానికి ప్రభుత్వం నుండి ప్రోత్సాహకంగా చేతివృత్తులను చేయడానికి కావలసిన నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఎదగడానికి అవసరమైన ఆలోచనలు సభ్యురాలు కలిగి ఉన్నారా అనేది కూడా పరిగణలోకి తీసుకుంటాం. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన ప్రతి కుటుంబంలో ఓ మహిళా పారిశ్రామికవేత్త ఉండాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఈ వివరాలతో వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికను తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తాం. దీని ద్వారా స్వయం సహాయక సంఘాలు మరింతగా అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వ ఉద్దేశం. తిరుపతి జిల్లా పరిధిలో 33 మండలాలకు సంబంధించి 70 శాతం సర్వే ఇప్పటికే పూర్తి చేసాం.

ప్రజాశక్తి : నూతన ఆలోచనలతో చేయూత కార్యక్రమాలు ఏదైనా చేస్తున్నారా?

డిఆర్డిఏ పీడీ : సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ (సెర్ప్) నేటివ్ అరకు కాఫీ వారితో ఎం ఓ యు కుదుర్చుకోవడం జరిగింది. స్వయం సహాయక సంఘాలలోని సభ్యులకు ఈ అరకు కాఫీ అవుట్‌లెట్సు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. రాష్ట్రవ్యాప్తంగా తీసుకుంటే 100 అవుట్‌లెట్సు ఏర్పాటు చేయాలని, అలానే జిల్లా వ్యాప్తంగా 10 నేటివ్ అరకు కాఫీ అవుట్‌లెట్సు ఫ్రాంచైజీ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా ఏప్రిల్ 25 నుండి జూన్ 25 తేదీ లోపల వీటిని ఏర్పాటు చేయనున్నాం. ప్రముఖంగా తిరుమలలో, తిరుపతిలో ఏర్పాటు చేయడానికి ఇప్పటికే సంబంధిత అధికారులకు లేఖలు రాశాం. దీని కేటాయింపు ద్వారా సంఘంలోని సభ్యురాలు ఆర్థికంగా ఎదగడానికి, వ్యాపారాభివృద్ధిలో మెలుకువలు తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే గిరిజన కార్పొరేషన్ ద్వారా ఆరకు కాఫీ స్టాల్స్ నడుపబడుతున్నాయి.

ప్రజాశక్తి : నూతన పెన్షన్ల నమోదు ఎప్పుడు చేపడతారు?

డిఆర్డిఏ పీడీ : ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీలో విచారణలు కొనసాగుతున్నాయి. సామాజిక పింఛన్ల తనిఖీ కార్యక్రమం జూలై నెల ఆఖరి వరకు కొనసాగనుంది. అటు తర్వాత ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నూతన పెన్షన్ల నమోదుకు కార్యచరణ ప్రారంభిస్తాం. ఇప్పటికే సదరం సర్టిఫికెట్లను జారీ చేయడానికి ఇటీవల ప్రభుత్వం నుండి గ్రామ వార్డు సచివాలయాలకు ఆదేశాలు అందాయి. దివ్యాంగులకు ఈ సదరం సర్టిఫికెట్ ద్వారానే ఎంత పెన్షన్ ఇవ్వాలన్న విషయాలు పక్కాగా తెలుస్తాయి. జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్లో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమాలకు వచ్చే అర్జీదారుల్లో నూతన పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు ఇస్తున్నారు.

సిగ్గు.. సిగ్గు

నేడు అంబేద్కరుడి 135వ జయంతి

వివక్ష.. అంటరానితనం.. అణచివేత ఇంకానా..?



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

సంపద సృష్టికి, సమాజాభివృద్ధికి తరతరాల నుండి శ్రమను ధారపోస్తున్న దళితులు, గిరిజనులు నేటికీ అమానుషమైన అంటరానితనం, కుల వివక్ష, అత్యాచారాలు, అణిచి వేతలకు, సాంఘిక బహిష్కరణలకు గురవుతున్నారు. భూమి, నీరు, సంపద, బడ్జెట్, అభివృద్ధిలో వాటా దక్కక, కేటాయింపులూ లేక, చేసినవీ అందక పేదలుగానే వున్నారు. అంతిమంగా పాలకులు ఆడే రాజకీయ చదరంగంలో సమిధలవుతున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అందని ద్రాక్షలా మారింది. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక సమానత్వ సాధనకై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అలుపెరగని పోరాటం చేశారు. నిమ్న జాతుల అభివృద్ధి, సాధికారత కోసం ఏకంగా రాజ్యాంగాన్నే రచించారు. అయితే ఆ రాజ్యాంగ ఫలాలు నేడు దళితులు, గిరిజనులు అనిభవిస్తున్నారా..? అంటే లేదనే చెప్పాలి. జనవరి 26న రాజ్యాంగ దినోత్సవాన్ని, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడం తప్పా ఒరిగిందేమీ లేదు. వివక్ష.. అంటరానితనం.. అణచివేత.. మూడు విడదీయరాని బంధంలా వేటికవే సమాజంలో నేటికీ వేన్నూళ్ళిపోయాయి. అయినా మనం నేడు అంబేద్కర్ జయంతిని నిర్వహించుకుంటున్నాం. అంబేద్కర్ అమర్ రహే అంటూ ఆయన ఆదర్శాలను చంపేస్తున్నాం. మనువాద ముసుగు వేసుకున్న కొందరు అగ్ర పాలకులు ఇందుకు ముఖ్య కారణమని చెప్పకుండా ఉండలేం.

అభివృద్ధికి ఆమడదూరంలో దళితులు

స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్ళు, గణతంత్రం సిద్ధించి 76 ఏళ్ళు గడుస్తున్నా దళితులు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నారు. దళితవాడల్లో సరైన మౌలిక వసతులు లేవు. పక్కా గృహాలూ కరువే. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లోని దళిత వాడలను, అగ్రకుల నివాసాలను ఓ సారి పరికించి చూస్తే తేడా కొట్టుకొచ్చినట్లు కనిపిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులంటూ బడ్జెట్ లో అర కొర కేటాయింపులు చేస్తున్నా, పాలకులు వాటినీ దారి మళ్ళించేస్తున్న పరిస్థితి. దళిత వాడల్లో సరైన మురుగు నీటి వ్యవస్థ లేక మురికి కూపాల్లో మగ్గుతున్న వైనం. సచ్చాకైనా వీటన్నింటికీ దూరంగా ఉండాలంటే శ్మశానాలు లేక, ఉన్నా దారి లేక అంతిమ యాత్రలు నరకంగా మారుతున్నాయి.

అంటరానితనం.. అణచివేత

భారతీయ సమాజాన్ని కసిగా కాటేస్తున్న కులం అనే కాలకూట సర్పానికి పాలు పోసి పెంచుతోంది పాలకులే. ఇదంతా ఎవరైనా మాట్లాడితే ఆ..ఈ కాలంలో ఇంకా కులం ఎక్కడ ఉందండీ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. అయితే వాస్తవ పరిస్థితుల్లోకెళితే కులం.. అంటరానితనం.. అగ్ర దాడులు వివిధ రూపాల్లో దళితులను, గిరిజనులను అణిచివేస్తూనే ఉన్నాయి. వీటికి సాక్షాలుగా నిలిచే పలు ఉదంతాలు గడిచిన ఐదేళ్లలో తూర్పు మండలాల్లో చాలానే జరిగాయి. చేపలు ఇవ్వనన్నందుకు ఓ గిరిజన బాలుడిని ఓ అగ్ర కులస్తుడు దారుణంగా హత్య చేసి ఇసుకలో పూడ్చిపెట్టిన విషాద ఘటన బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పల్లమాలలో ఇదేళ్ల కిందట చోటుచేసుకుంది. ఓ యాదవ అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నందుకు ఓ దళిత కుటుంబంపై ఊరు ఊరంతా కలిసి దాడి చేసిన ఘటన నాలుగేళ్ల కిందట ఏర్పేడులో చోటుచేసుకుంది. కులాంతర వివాహం చేసుకున్నందుకు దళితులను గ్రామ బహిష్కరణ చేసిన ఘటన కేవీబీ పురం మండలం అంజురుపాలెంలో ఏడాది కిందట చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా నడపమన్నందుకు ఆగ్రహించిన అగ్రకులస్తులు గిరిజనులపై మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన రెండు రోజుల కిందట తొట్టంబేడు మండలం విరూపాక్షపురంలో చోటుచేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదంతాలే ఉన్నాయి. వీటన్నిటినీ దాటి దళితులు, గిరిజనులు సామాజిక, ఆర్థిక సమానత్వం సాధిస్తేనే అంబేద్కరుడికి మనమిచ్చే అసలైన నివాళి. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్ జయంతి సందర్భంగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని పుత్తేరి గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తికి చెందిన శ్రీ బాలాజీ క్లినిక్ జనరల్, గైనకాలజీ నిపుణులు డాక్టర్ భానుమతి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామ సర్పంచ్ రామ్మూర్తి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు.

టీడీపీలో పాత కమిటీలు రద్దు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : టిడిపిలో ఉన్న అన్ని కమిటీలు రద్దు అయ్యాయని మరల నూతన కమిటీలను వేయడం జరుగుతుందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలో ఉంటానని భావిస్తున్నవారు కె.ఎస్.ఎస్ లో పేరు నమోదు అయి ఉండాలని ఇలా ఉంటేనే కమిటీల్లోకి తీసుకోవడం జరుగుతుందని నాయకులందరూ సహకరించాలని కోరారు.

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న పరిశుద్ధ పౌలు పేతురు సంఘంలో సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పి.సి.సి చైర్మన్ రాజయ్య, ఎల్.ఎస్.సి, పి.సి.సి సభ్యులు, సండే స్కూల్ పిల్లలు, స్త్రీల సమాజం వారు కలిసి దేవుని నామమును మహిమ పరిచారు. ఏసు క్రీస్తు గీతాలు ఆలపిస్తూ పుర వీధుల్లో మట్టలతో ర్యాలీ చేపట్టారు.

గరిమెళ్లకు వెంకయ్య నాయుడి నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : సంకీర్తనలను స్వరపరడన్ని ఓ వృత్తిగా గాక, జీవితాన్నే సంకీర్తనగా మలచుకుని, శ్రీవారి సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్న భాగ్యశాలి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అని ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జరిగిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. గరిమెళ్ల అన్నమయ్య సంకీర్తనలతో టీటీడీ వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకోవడం అభినందనీయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మర్రిశ్వర సేవలను గుర్తించి నేషనల్ ఇంటర్నేషనల్ పీక్ కౌన్సిల్ పుదుచ్చేరి వారిచే డాక్టరేట్ అందుకోవడం గర్వకారణమని త్రినేత్ర పిరమిడ్ ధ్యాన బాలసుబ్రమణ్యం నాగరాజు తెలిపారు. త్రినేత్ర పిరమిడ్ ధ్యాన మందిరం, పుత్తూరులో ప్రతి నెలా సత్సంగంలో టీచర్‌గా పనిచేసిన జెమిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, సుజాత, శివమల్లరాజు ధ్యాన సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 49 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 49 వినతులు వచ్చాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాదర్బార్ జరిగింది. వచ్చిన వినతుల్లో మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి 15, రెవెన్యూ శాఖకు సంబంధించి 1, టిటిడికి సంబంధించి 9, పోలీసు శాఖకు సంబంధించి 2, విద్యుత్ శాఖకు సంబంధించి 4, సిఎంఆర్ఎఫ్‌కు సంబంధించి 3 వినతి పత్రాలు వచ్చాయి. ఆఫ్ లైన్ సోర్టింగ్‌లో జాబ్‌లు, కళాశాల ఫీజు తగ్గింపు, నామినేటెడ్ పోస్టులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, విద్యుత్ శాఖ ఏఈ రఘు, సచివాలయ ఉద్యోగులు, ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, కీర్తన, లోకేష్, జీవకోన సుధాకర్, రమేష్, సిద్ధయ్య, మాల్యాద్రి, సుబ్బారావు, రమణా రెడ్డి, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బత్తెన మధు, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచారి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

నగిరి ఎమ్మెల్యేను కలిసిన శ్రీ చక్ర సోషల్ సర్వీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుచానూరులో 2021లో ప్రారంభించిన శ్రీ చక్ర సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో అనాథ ఆశ్రమం కోసం ఆదివారం సర్వీస్ అధ్యక్షులు జోగిపల్లి మనోజ్ కుమార్ నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కలిశారు. అనాథ వృద్ధులకు, వృద్ధాశ్రమం పెట్టేందుకు నగరి నియోజకవర్గంలో ఎక్కడైనా స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను కోరినట్టు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి కేటాయించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చక్ర సోషల్ సర్వీస్ టీంతో పాటు, ప్రవీణ్ పాల్గొన్నారు.

మే 3న ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మే 3వ తేదీ గూడూరు సాది మంజిల్‌లో మహమ్మదీయాన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ప్రముఖ కోవూరు డాక్టర్ షేక్ మహబూబ్ బాషాచే ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న కార్యక్రమం నిర్వహించబడుతుందని నెట్వర్క్ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ తెలియజేశారు.

పాత్రికేయులు కృష్ణ మోహన్‌కు నివాళి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రాంతానికి చెందిన సీనియర్ పాత్రికేయులు చిరువెళ్ల కృష్ణ మోహన్ మృతి చెందారని సమాచారం తెలుసుకుని ఆదివారం గూడూరు సొసైటీ సెంటర్‌లోని కృష్ణ మోహన్ పార్థివ దేహానికి రాష్ట్ర మాజీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పొనకా దేవసేనమ్మ, ప్రముఖ పారిశ్రామిక వేత్త శివకుమార్ రెడ్డి నివాళులు అర్పించారు.

మణి నాయుడు సారథ్యంలో అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.ఎన్ కండ్రిగ మండలంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు కె.మణి నాయుడు సారథ్యంలో నేడు అంబేద్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించబడుతుందని మనినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైసీపీ సత్యవేడు ఇన్చార్జి నూకతోటి రాజేష్ రానున్నారని తెలిపారు.

ఫీజు బకాయిలు విడుదల చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఇంజనీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిల్ని కూటమి సర్కారు చెల్లించని కారణంగా ఉన్నత విద్యార్థులు పై చదువులకి దూరమవుతున్నారని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం ఎస్ వి యూనివర్సిటీ అధ్యక్షులు మనం ప్రేమ్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వ పది నెలల పాలనా కాలంలో విద్యార్థులకు ఫీజులు రాక ఉన్నత విద్య కి దూరం అవుతున్నారని మండి పడ్డారు. సెమిస్టర్ వారీగా ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థుల్ని ఒత్తిడి చేస్తుంటే వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థుల్ని విద్యకి దూరం చేసే కూటమి చర్యలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిల్ని తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల కోసం విద్యార్థుల్ని వేధించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : సిపిఆర్‌పై విద్యార్థులకు కనీస పరిజ్ఞానంతో పాటు అవగాహన అవసరమనీ ప్రముఖ కార్పొరేట్ శిక్షకుడు సొప్పరపు రత్నశేఖర్ పేర్కొన్నారు. తిరుపతి ఎం.ఆర్.పల్లి వద్ద వున్న కొటిల్ల ఇన్స్టిట్యూట్ లో సి.పి.ఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై ఆదివారం ఉచిత వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కార్పొరేట్ శిక్షకులు సొప్పరపు రత్నశేఖర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కొటిల్ల ఇన్స్టిట్యూట్‌లో బ్యాంకు, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న డిగ్రీ, బి.టెక్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సి.పి.ఆర్ అనేది అత్యవసర పరిస్థితుల్లో ఎవరికైనా హృదయ స్పందన లేదా శ్వాస ఆగిపోయినప్పుడు ప్రాణాలను రక్షించే సాంకేతిక పరిజ్ఞానమన్నారు. ఈ కార్యక్రమంలో కోటిల్ల డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత కోల్పోతున్న వైద్యరంగం

దోపిడీ సాధనంగా ఫార్మా రంగం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : వైద్య రంగం సామాజిక బాధ్యతను కోల్పోతున్నదని, ఫార్మా పరిశ్రమ దోపిడీకి సాధనంగా మారిందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, ప్రముఖ ఆక్యుపంక్చర్ వైద్యులు డాక్టర్ బాలాజీ, డాక్టర్ జాలేశ్వరరావు, డాక్టర్ రవీంద్ర, జనవిజ్ఞాన వేదిక నాయకులు రాహుల్, సీనియర్ జర్నలిస్టు రాఘవ, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యంలు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర రాష్ట్రంలో ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆద్యులు డాక్టర్ గురుకులమిత్ర సంస్మరణ సభ ఆదివారం నాటి ఉదయం వేమన విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సభలో వక్తలు ప్రసంగిస్తూ ఆధునిక వైద్యరంగం గాడి తప్పిందని, వ్యవస్థలో అత్యంత అమానవీయ స్థితికి చేరుకున్నదని సోదాహరణంగా వివరించారు. ఈ పరిస్థితికి ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని, ప్రభుత్వ వైద్యం బలహీన పడి... కార్పొరేట్ వైద్యం బలపడటానికి కేటాయింపులు తగినంత లేకపోవడమే ప్రధానమైన కారణమని అన్నారు. ఇరాన్, ఉరుగ్వే లాంటి చిన్న దేశాలలో వైద్యానికి 26% కు పైగా కేటాయింపులు ఉండగా, భారతదేశంలో 3.5% కేటాయింపులు ఉన్నాయని రాష్ట్రంలో మరీ అధ్వానంగా 1.5% కేటాయింపులు ఉన్నాయని గుర్తు చేశారు. కార్పొరేటు ఆసుపత్రుల్లో వైద్యులు రోజు కూలీలుగా మారిపోయిన దౌర్భాగ్యస్థితి భారతదేశంలో నెలకొని ఉందని వివరించారు. అల్లోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హెూమియోపతి, ఆక్యుపంక్చర్, యునాని వంటి వైద్య ప్రక్రియలలో ఒకదానికి మరొకటి పోటీ కాదని దేనికుండే ప్రత్యేకతలు దానికి ఉన్నాయని వీటిలో మంచి అంశాలను ప్రోత్సహించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. గురుకుల మిత్రా లాంటి వైద్యులు కరువవుతున్నారని వేళ్ళ మీద లెక్కపెట్టే పరిస్థితి ఏర్పడిందని... తనకు అనేక అవకాశాలు ఉన్నా వైద్యాన్ని సామాజిక సేవకు గురుకుల మిత్ర వినియోగించారని గుర్తు చేశారు. వందల మంది ఆక్యుపంక్చర్ వైద్యులను తయారుచేసిన చరిత్ర ఆయనదని తెలిపారు. తిరుపతి నగరంలో ఆక్యుపంక్చర్ వైద్య ప్రక్రియను సామాజిక బాధ్యతగా కొనసాగిస్తున్న డాక్టర్ బాలాజీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రతి ఏడాది ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించడమే కాకుండా, తిరుపతి జిల్లా ప్రజల సౌకర్యార్థం ప్రతి మంగళవారం నాడు తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని డాక్టర్ బాలాజీ నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

వేమన విజ్ఞాన కేంద్రంలో బీసీ రాయి జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫలితాల్లో టిఎంఆర్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - చిట్టమూరు: ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చిట్టమూరు మండలం కొత్తగుంటలోని టిఎంఆర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.కీర్తన 982/1000 మార్కులతో టాపర్‌గా నిలిచారు. నాని 980 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 84 మంది విద్యార్థులకు గాను 80 మంది పాసై 95 శాతం ఉత్తీర్ణత సాధించగా, మరో 21 మంది విద్యార్థులు 900 పైగా మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, చండీశ్వరి 932/1000 మార్కులతో బైపీసీలో టాపర్గా నిలిచారు. మరో 6మంది విద్యార్థులు 850 కి పైగా మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 470 మార్కులకు గాను దీపిక 455 మార్కులతో టాపర్‌గా నిలవగా, మరో 11 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారని కళాశాల కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి తెలియజేశారు. విద్యార్థులను కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ రహంతుల్లా లు అభినందించారు.

సత్తా చాటిన గురుకులం బాలికలు

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్ : ఇంటర్ ఫలితాల్లో పుత్తూరు మండలం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో బాలికలు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో 27 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 25 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. హెచ్ఇసి గ్రూప్‌లో 17 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 15 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం 90.90 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూప్‌లో 23 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 92.68% ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూపులో మోహన 479 మార్కులు, ధరణి 477 మార్కులు, హెచ్ఈసిలో చంద్రిక 453 మార్కులు, జెనీఫర్ 415, ద్వితీయ సంవత్సరం సీఈసీలో నికిత 942 మార్కులు, చెంచు లిఖిత 933, హెచ్ఈసి లో శిరీష 927 మార్కులు, లోకేశ్వరి 903 మార్కులు సాధించారు.

మంగళం ట్రెండ్స్ హైస్కూల్ ప్లస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇంటర్మీడియట్ ఫలితాలలో మంగళం ట్రెండ్స్ హై స్కూల్ ప్లస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచారని ప్రిన్సిపాల్ కేశవులు నాయుడు తెలిపారు. ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరంలో వి.జనని 424 మార్కులతో మొదటి స్థానంలో నిలచిందన్నారు. బైపిసి మొదటి సంవత్సరంలో 440 మార్కులకు గాను మైథిలి 388 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో హర్షిత 865 మార్కులను సాధించారన్నారు. ప్రారంభించిన కొద్ది కాలంలోనే విద్యార్థులు పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించామన్నారు.

ఎస్ ఆర్ విద్యాసంస్థ విద్యార్థుల విజయ కేతనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో తిరుపతి శ్రీనివాసపురం, రేణిగుంట బ్రాంచ్ ల ఎస్ ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తిరుపతి బ్రాంచ్ జోనల్ ఇన్చార్జి రమేష్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాలలో 1000 మార్కులకు గాను మనోజ్ఞ 989 మార్కులు సాధించి టాపర్ గా నిలిచారన్నారు. హర్షవర్ధన్ 985, పవన్ కళ్యాణ్ 985, రూపశ్రీ 984, వెంకట ప్రసాద్ 981, అలానే 40 మంది విద్యార్థులు 950 కు పైగా మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఫలితాలలో 470 మార్కులకు గాను యుగంధర్ 464, భాను ప్రకాష్ రెడ్డి 463, ఆదర్శ కుమార్ 463, గూగుడు వల్లి 462, రాకేష్ 461, బంగారం 461, 45 మంది విద్యార్థులు 450 కు పైగా మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అకాడమిక్ డీన్ అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేష్ ప్రత్యేకంగా అభినందించారు.

బిఎన్ఐ తిరుపతి కాన్‌క్లేవ్ 2.0 గ్రాండ్ లాంచ్

కాన్ క్లేవ్ 2.0ను లాంచ్ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్థానిక వ్యాపారాలను అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి, లోకల్ టు గ్లోబల్ అనే నినాదంతో తీసుకెళ్లడానికి ఆదివారం బిఎన్ఐ తిరుపతి కాన్ క్లేవ్ 2.0 ను ఘనంగా లాంచ్ చేశారు. ఈ లాంచింగ్ కార్యక్రమానికి బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, సీనియర్ సపోర్ట్ డైరెక్టర్ డాక్టర్ సాయికిరణ్ రెడ్డి, కాన్ క్లేవ్ చైర్మన్ ఆర్కిటెక్ట్ మణి సందీప్, కాన్ క్లేవ్ కో చైర్మన్ టెంకాయల దుర్గాప్రసాద్ హాజరై ప్రారంభించారు. మెంబర్స్ డే సంబరాలను చైర్మన్ బాలాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడి సంతోష్ మాట్లాడుతూ నెట్వర్కింగ్ బ్రాండ్ ప్రమోషన్ ద్వారా తిరుపతిలో స్థానికంగా ఉన్న చిన్న వ్యాపారాలు కూడా అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు.

గల్లా అరుణ కుమారి స్వీయ చరిత్ర మహిళలకు స్ఫూర్తి

ప్రజాశక్తి - తిరుపతి : మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ జీవిత చరిత్ర మహిళలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి, కథా రచయిత, మాజీ పార్లమెంటు సభ్యులు విజయేంద్రప్రసాద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా, తవణంపల్లి మండలం, దిగువ మాఘం గ్రామానికి విచ్చేశారు, ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, రమాదేవి వారికి స్వాగతం పలికారు. అనంతరం రాజన్న పార్కుకు చేరుకుని మాజీ ఎంపీ దివంగత రాజగోపాల్ నాయుడు విగ్రహానికి నివాళి అర్పించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి స్వీయ జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని తాను చదివానని, మంచి కూతురుగా, మంచి భార్యగా, మంచి మంచి తల్లిగా, ప్రజలకు మంచి సేవలు అందించే నాయకురాలిగా ఎదిగిన అరుణమ్మ మహిళలకు స్ఫూర్తిదాయకమన్నారు. గల్లా అరుణ కుమారి కుటుంబం అనుమతి ఆమె జీవిత కథ సినిమా కంటే వెబ్ సిరీస్ రూపంలో తీస్తే మరింత ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా దిగువమాగం గ్రామంలో గల్లా అరుణ కుమారి ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీయకండి: సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా దుష్ప్రచారాలు చేయడం మానుకోవాలని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ హితవు పలికారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎక్కడో ఆవుల మృతి ఫోటోలను తీసుకు వచ్చి గోశాలకు ఆపాదించడం సరైన పద్ధతి కాదన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం టీటీడీని వినియోగించుకోవడం మానుకోవాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, సురా సుధాకర్ రెడ్డి, దంపూరు భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ, రజనీకాంత్, సురేంద్ర నాయుడు, బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఈశ్వరయ్యపై బదిలీ వేటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్యపై బదిలీ వేటు పడింది. ఆయన్ను వీఆర్‌కు బదిలీ చేస్తూ శనివారం ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐ పనితీరుపై కూటమి నేతలు అసంతృప్తిగా ఉండడంతో ఆయనపై రాజకీయ వేటుపడిందని తెలుగు తమ్ముళ్ల గుసగుస.

రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలవుదాం

ప్రజాశక్తి -ఏర్పేడు : యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పేడు, సంత మైదానంలో రుయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ల సిబ్బంది పర్యవేక్షణలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా 33 మందికి పైగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారని, ఫౌండర్ డాక్టర్ గానుగ పెంట రమేష్, సంస్థ రాష్ట్ర అధ్యక్షులైన తాళిక్కాల్ వెంకటేశ్వర్లు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు రూయా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్స్ రాహుల్, భరద్వాజ్, కౌన్సిలర్ వాహిని, సిబ్బంది, సంస్థ సభ్యులు వేణు, దినేష్, వాణి,కర్ణ, గురు, సాయి, నవీన్, హర్షా మరియు సభ్యులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో ఒప్పంద ప్రతిపాదికన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎంపిక సంఘం అధ్యక్షులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య స్కీము లో తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న కౌన్సిలర్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇతర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. విద్యార్హతలు వెబ్సైట్ లో పరిశీలించుకోవాలని, ప్రారంభ జీతం రూ.7944/- నుండి రూ.18,536/- (పోస్ట్ ఎంపికబట్టి) దరఖాస్తులను పోస్టు ద్వారా, లేదా నేరుగా కార్యాలయంలో సమర్పించడానికి ఈనెల 15 నుండి 30వ తారీకు సాయంత్రం ఐదున్నర గంటలలోపు సమర్పించాలన్నారు. వివరాలకు అభ్యర్థులు జిల్లా కలెక్టరేట్లోని బి బ్లాకులో ఉన్న జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత వారి కార్యాలయంలో సందర్శించాలన్నారు.

ఐసిడిఎస్ ఆఫీసు ముందు అపరిశుభ్రం

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : రాపూరు క్రాస్ రోడ్‌లో వెంకటగిరి ఐసిడిఎస్ ఆఫీసు ముందు చెట్లు పెరిగిపోయి చెత్తాచెదారంతో నిండి, అపరిశుభ్రంగా ఉన్నది. విష కీటకాలు, దోమల బెడద పెరిగిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మెయిన్ రోడ్డు ప్రక్కనే చెట్లు పెరిగిపో తున్నా, చెత్త పేరుకు పోతూఉన్నా సంబంధిత శాఖ అధికారులకు కనిపించకపోవడం దురదృష్టకరమని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచాలని కోరుతున్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎస్సీ కార్పొరేషన్ రుణాలను సంబంధిత షెడ్యూల్డ్ కులానికి చెందిన వారు సద్వినియోగపరుచుకోవాలని తిరుపతి ఎస్సీ కార్పొరేషన్ ఈడియు చెన్నయ్య తెలిపారు. రుణాలకోసం ఈ నెల 14 నుంచి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరిశ్రమలు, వ్యాపారం, రవాణా రంగం, వ్యవసాయ రంగాలకు సంబంధించి జిల్లాలో 1267 మందికి మొత్తం యూనిట్ల విలువ రూ.5289.90 లక్షలు, అందులో సబ్సీడీ రూ. 2088.64లక్షలు, బ్యాంకు లోన్ రూ.2936.77లక్షలు, లబ్దిదారుని వాటాగా రూ. 264.50 లక్షలు ఉంటుందని తెలిపారు. సంబంధిత పత్రాలతో ఈ సేవ కేంద్రంలోకానీ, ఆన్ లైన్‌లోకానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఘనంగా విద్యా వార్షికోత్సవం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : వరదయ్యపాలెం మండల కేంద్రం, లోకా ఫౌండేషన్ విద్యా విభాగ్ వారి ఆధ్వర్యంలో విద్యా వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లోకాఫౌండేషన్ చైర్మన్ లోకేష్ దాసాజీ, సునీల్ దాసాజీ, వరదయ్యపాలెం విద్యాశాఖాధికారి గున్నయ్య, బియన్ కండ్రిగ మండల విద్యాశాఖాధికారి ముని సుబ్రహ్మణ్యం, సుందర రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగ్ కో ఆర్డినేటర్ హరిగోపాల్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు కుమార్, ముద్దు కృష్ణ ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, వాలంటీర్లు, ఆనంద్ రావు, సుందరరామి రెడ్డి, సుందర్ రెడ్డి, రాజు, బాబాయ్, భగవాన్‌లు పాలొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -కోట : అంబేద్కర్ విగ్రహాలను నేడు ఎస్పై వెంకట రమణ చేతుల మీదగా ఆవిష్కరిస్తున్నట్లు అడ్వకేట్ యానాటి మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వాకాడు మండలంలోని నలగామాల, చిట్టమూరు మండలంలోని గుణపాడు అదేవిధంగా విడవలూరు, బుచ్చి ఇంకా పలు ప్రాంతాల్లో అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత దామవరపు రఘురాములు, హెడ్ కానిస్టేబుల్ దుడ్డు రమణయ్య, ఏపీఎం కట్టెపల్లి సింహాద్రి, బి.ఏ.ఎల్.ఎల్. అడ్వకేట్ యానాటి మస్తాన్, కానిస్టేబుల్ ఎంబేటీ భాస్కర్, కానిస్టేబుల్ తీపలపూడి శ్యాంసన్, నాయుడుపేట జర్నలిస్ట్ అబ్రహం, కర్లపూడి రాంబాబులు పాల్గొననున్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఏప్రిల్ 15 గడువు

ప్రజాశక్తి - క్యాంపస్ : పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ - 2025 దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోందని, ఇందుకు సంబంధించిన గడువు ఏప్రిల్ 15వ తేదీతో ముగుస్తుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం పోటి పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్ 2025 ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8688888802/03, 9399976999 నెంబరులకు సంప్రదించవచ్చునని తెలిపారు.

అంబేద్కర్ జయంతికి ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడులో అంబేద్కర్ భవనం నందు అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించాలని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పిల్లపాలెం వాసు పిలుపుతో ముమ్మరంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలని అధ్యక్షులు కోరారు.

కూరగాయలు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, మాయాబజార్, సిపిఎం ఆఫీస్‌లో ఆదివారం కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యుడు అత్తిమంజరి గోపాల్, మల్లీశ్వరి దంపతుల కుమారుడు రామ శివకృష్ణ పుట్టినరోజు వేడుకలను దివ్యాంగుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నిరుపేదలైన 20 మంది దివ్యాంగులకు గోపాల్, మల్లీశ్వరి దంపతుల కుమారుడు రామ శివకృష్ణ చేతుల మీదుగా కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రమణయ్య, సురేంద్రబాబు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవపట్టణ పరిధిలోని అడివయ్యకాలనీలో గల గాడ్ గ్రేస్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు భాషాజాన్ పాల్ , రఫీ, మహిమ గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.

6 లైన్ ప్రయాణం సూపర్

- పూర్తయిన నాయుడుపేట రహదారి
- త్వరలోనే ప్రారంభానికి సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : దక్షిణ భారతదేశంలోనే పెద్ద రింగ్‌రోడ్డు నాయుడుపేట సర్కిల్.. అందమైన ఈ ఆరువరుసల జాతీయ రహదారి త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారు. ఇప్పటికే వాహనాల రాకపోకలు జరుగుతూనే ఉన్నాయి. 71వ జాతీయ రహదారి నాయుడుపేట నుంచి తిరుపతికి 57 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డులో తిరుపతి చేరుకోవాలంటే రెండున్నర గంటల నుంచి మూడు గంటల సమయం పట్టేది. ప్రస్తుతం గంట వ్యవధిలోనే చేరుకుంటున్నారు. దీనివల్ల శ్రీవారి భక్తులకు, ప్రయాణికులకు, టూవీలర్, ఫోర్ వీలర్ వాహన దారులకు ఈ రోడ్డులో ప్రయాణం ఎంతో సౌలభ్యం అయ్యింది. ఇదే రోడ్డులో గతంలో శ్రీవారి దర్శనం కోసం వస్తూ ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో విగతజీవులయ్యారు. ప్రస్తుతం ఆరు లైన్ల రహదారి కావడంతో వారివారి గమ్యస్థానాలకు ఇబ్బందులు లేకుండా చేరుకుం టున్నారు.

గతంలో కోస్తా జిల్లాల నుంచి రోడ్డు మార్గంలో తిరుపతి వెళ్లే వారికి నాయుడుపేట-రేణిగుంట మధ్య ప్రయాణమంటేనే నరకంగా కనిపించేది. వాహనాల రద్దీతో పాటు కేవలం రెండు వరుసలతో రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో అధిక సంఖ్యలో ప్రమాదాలూ జరిగేవి. కేవలం 57 కి.మీ. దూరం ప్రయాణించేందుకు రెండు నుంచి మూడు గంటల సమయం పట్టేది. ప్రస్తుతం ఆరు వరుసల రహదారి అందుబాటులోకి వచ్చింది. 71వ జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తికావడంతో ప్రస్తుతం దీనిపై వాహనాల రాకపోకలను అనుమతిస్తున్నారు. దీంతో కేవలం గంటలోపే 57 కి.మీ. దూరం ప్రయాణించి సాఫీగా తిరుపతికి వెళ్లే అవకాశం ఉంది.

కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిలో నాయుడుపేట వద్ద మొదలై శ్రీకాళహస్తి, ఏర్పేడు మీదుగా కడప-రేణిగుంట-చెన్నై జాతీయ రహదారిలోని రేణిగుంటకు సమీపంలో ఈ రహదారి కలుస్తుంది. 2020, డిసెంబరులో రూ. 1,931 కోట్లతో నిర్మాణ పనులను 'మెగా' ఇంజినీరింగ్ సంస్థకు అప్పగించారు. 264 హెక్టార్ల మేర భూసేకరణలో చాలావరకు కొలిక్కి వచ్చాయి. అనంతరం 2022 జనవరి 31నుంచి పనులు మొదలయ్యాయి.

కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారిలో కలిసేలా నాయుడుపేట వద్ద ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మించారు. అలాగే రేణిగుంట వద్ద రౌండ్ అబౌట్ నిర్మించారు. మధ్యలో శ్రీకాళహస్తి, ఏర్పేడు వద్ద బైపాస్‌లను ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక వాహనాలేవి హైవే మీదకు రాకుండా హైవేకు ఇరువైపులా సర్వీస్ రోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లారీలు, బస్సులవంటి వాహనాలు గంటకు 80 కి.మీ. వేగంతో, అలాగే కార్లు వంటి వాహనాలు గంటకు 100 కి.మీ. వేగంతోనూ వెళ్లేలా డిజైన్ చేసి నిర్మించారు.

ఒకవైపు (మూడు వరుసలకు) 14.5 మీటర్ల చొప్పున అలాగే రెండు వైపులా కలిపి 29 మీటర్లు, మధ్యలో మీడియన్ 4 మీటర్లు కలిపి మొత్తం 33 మీటర్ల వెడల్పును ఈ హైవే కలిగి ఉంది. ఈ మీడియన్ నుంచి మొదటి లైన్‌ను కార్ల వంటి ఇతర లైట్ మోటారు వాహనాల కోసం కేటాయించారు. అలాగే రెండో లైనును లారీలు, బస్సుల కోసం ఏర్పాటు చేశారు. చివరన ఉండే మూడో లైన్ మాత్రం అత్యధిక లోడుతో ఉండే, ఎక్కువ చక్రాలు కలిగిన భారీ వాహనాలకు కేటాయించారు. మొత్తం 57 కి.మీ. పొడవునా మీడియన్‌లో గడ్డి, మొక్కలు పెంచేందుకు డ్రిప్‌ను ఏర్పాటు చేశారు. అప్రోచ్‌లు, వంతెనలు, సర్వీస్ రోడ్లలో గ్రామాలున్న చోట, అలాగే క్రాస్‌రోడ్స్ వద్ద కలిపి మొత్తం 1,500 స్తంభాలు ఏర్పాటు చేసి లైటింగ్‌ను పెట్టారు. అదేవిధంగా ఏర్పేడు వద్ద టోల్‌ప్లాజా నిర్మించారు. హైవే నిర్మాణ సమయంలో భారీ వర్షాలతో ఆటంకాలు కలిగినా పనులు చేయగలిగామని మెగా ఇంజినీరింగ్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ కె.రాంబాబు తెలిపారు.